www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 31 జులై 2024
5
అన్నమయ్య

విరబూసిన బ్రహ్మకమలం

ప్రజాశక్తి-పీలేరు

పట్టణంలో ఓ ఇంట బ్రహ్మ కమలాలు విరబూశాయి. పరిమళాలను పంచుతున్నాయి. స్థానిక ప్రకాశం రోడ్డులో నివాసముంటున్న షామియానా మణి అనే సుబ్రహ్మణ్యం, లక్ష్మీదేవి వాకిట మంగళవారం బ్రహ్మ కమలాలు విరబూసాయి. ఇవి ఏడాదికి ఒక్కసారి మాత్రమే ఆగస్టు నెల ఆరంభంలో పూస్తాయి. ఇవి సహజంగా హిమాలయ పర్వతశ్రేణుల్లో, ఉత్తర ప్రదేశ్, ఉత్తర బర్మా, టిబెట్, నేపాల్, దక్షిణ చైనాలో మాత్రమే దర్శనమిస్తాయి. బ్రహ్మకమలం ఉత్తరాఖండ్ రాష్ట్రీయ పుష్పంగా గుర్తించబడింది. దీన్ని 'కింగ్ ఆఫ్ హిమాలయన్ ఫ్లవర్' అని కూడా పిలుస్తారు. ఈ మొక్క అగ్ర భాగంలోని ఆకులే పుష్పంలా రూపాంతరం చెందడం ఓ విశేషం. బ్రహ్మ కమలంపై బ్రహ్మదేవుడు ఆశీన్నుడై ఉంటాడని హిందూ పురాణాలు చెబుతాయన్నది ప్రతీతి. బ్రహ్మ కమలం అనేది ఓ ఖగోళ పుష్పం. ఇది ఏడాదిలో ఒక రాత్రి మాత్రమే వికశిస్తాయి. ఆయుర్వేదం ప్రకారం ఈ పుష్పం అనేక ఔషధ ప్రయోజనాలు కలిగి ఉందని అంటుంటారు. ఏది ఏమైనా ఈ పుష్పం చూపురులనుమాత్రం చాలా చక్కగా ఆకట్టుకుంటుంది.

నామినేటెడ్.. చోటెవరికి?

- దాడులకుగురైన కార్యకర్తలకా...ఇన్‌ఛార్జీల సిఫారసులకా..!
- చంద్రబాబు హామీ అమలుకు నోచుకునేనా?
- టిడిపి కార్యకర్తల్లో అయోమయం

జిల్లాలో నామినేటెడ్ పోస్టుల కోలాహలం నెలకొంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి అధ్యక్షులు చంద్రబాబు నేతృత్వంలో అధికారంలోకి వచ్చిన కూటమి పార్టీలకు నామినేటెడ్ పోస్టుల పంపిణీకి ఫార్ములాను రూపొందించారు. కూటమి పార్టీలకు పోగా మిగిలిన పోస్టుల భర్తీ ప్రక్రియలో వైసిపి శ్రేణుల బారినపడి తీవ్రంగా గాయపడిన సంఘటనల్లో ప్రాణాలతో మిగిలిన కేడర్‌ను గుర్తించి నామినేటెడ్ పదవులు ఇవ్వనున్నారా, నియోజకవర్గ ఇన్‌ఛార్జిల సిఫారసు లెటర్ల ఆధారంగా ఇస్తుందా అనే చర్చ నడుస్తోంది. ఇన్‌ఛార్జిల లెటర్లు ఆధారంగా నామినేటెడ్ పోస్టులు ఇస్తే పార్టీ కోసం ప్రాణాలొడ్డిన కార్యకర్తలకు అన్యాయం చేసినట్లు అవుతుందనే వాదన బలంగా వినిపిస్తోంది. నియోజకవర్గ, పార్లమెంట్ ఇన్‌ఛార్జిలు ఒకటి, రెండు అధిపత్య కుల, సామాజిక తరగతులకు చెందిన కార్యకర్తలను మాత్రమే సిఫారసు లెటర్లు ఇచ్చే అవకాశాలు ఉన్నాయని వాదన వినిపిస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

2019 సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం వైసిపి అరాచకం సాగించిన సంగతి తెలిసిందే. ఎన్నికల ఫలితాలు అనుకూలముగా రావడంతో వైసిపి కేడర్ సాగించిన భౌతిక, ఆర్థిక, దాడుల్లో సుమారు 82 మంది టిడిపి కార్యకర్తలు తీవ్రంగా నష్ట పోయినట్లు సమాచారం. ఇటువంటి వారిలో ఒంటి మిట్ట మండలం నడింపల్లికి చెందిన గగ్గుటూరి మౌలాలి మొదటి వరుసలో ఉన్నారనడంలో సందేహం లేదు. 2019 సార్వత్రిక ఎన్నికల ఫలితాలు పూర్తిగా వెలువడక ముందే రాష్ట్రంలోనే మొదటగా ఈయన ఇంటి ముంగిట పటాసులు పేల్చడాన్ని ప్రస్తావించిన పాపానికి కర్రలు, రాళ్లతో తీవ్రంగా గాయ పరిచిన ఘటనలో అపస్మారక స్థితిలోకి పోయిన సంగతి తెలిసిందే. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టిడిపి కార్యకర్తలపై పెద్దఎత్తున దాడులు చోటు చేసు కోవడం గమనార్హం. చంద్రబాబు 2019 డిసెంబర్‌లో కడపలో వైసిపి బాధితులందరినీ సమీకరించి వారిలో ధైర్యాన్ని నూరిపోసిన సందర్భంలో దాడుల్లో గాయపడిన, నష్ట పోయిన బాధితులందరికీ ఆర్థిక, న్యాయ, నామినేషన్ పదవుల కేటాయింపుల్లో ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. 2024 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి అధికారంలో వచ్చిన వెంటనే చంద్రబాబు వైసిపి బాధితుల సంరక్షణకు ఉద్దేశించి కమిటీ వేసి గ్రీవెన్స్ పరిష్కారానికి శ్రీకారం చుట్టడం వరకు బాగానే ఉంది. కేసుల కొట్టివేతకు గల అవకాశాల పరిశీలన, ఆర్థిక సహకారం, నామినేటెడ్ పోస్టుల భర్తీలో ప్రాధాన్యతపై ఇచ్చిన హామీని అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు. జగన్ సొంత జిల్లాలో ముఖ్యమంత్రి హోదాలో ఉన్నప్పుడు ఆయనను ధిక్కరించి, నిరసనలు, ధర్నాలకు దిగిన బడుగు, బలహీనవర్గాలకు చెందిన కార్యకర్తలకు కేటగిరీలకు అతీతమైన పదవులు కట్టబెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వైసిపి దాడుల బారిన పడిన సీనియర్ కార్యకర్తలకు సత్వరమే న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కూటమి పార్టీలకు నామినేటెడ్ పోస్టుల భర్తీలో భాగస్వామ్యం ఇవ్వడంతో టిడిపి గణనీయంగా నష్టపోనుంది. టిడిపి ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో 30 శాతం జనసేన, 10 శాతం బిజెపి కార్యకర్తలకు, బిజెపి ఎమ్మెల్యే ఉన్న స్థానాల్లో టిడిపికి 50 శాతం, బిజెపి, జన సేనలకు 50 శాతం నామినేటెడ్ పోస్టులు కేటాయిస్తే అప్పట్లో వైసిపి బారిన పడిన తమ పరిస్థితి ఏమిటనే చర్చ నడు స్తోంది. అప్పట్లో జనసేన, బిజెపి కార్యకర్తలు ఎలాంటి కష్టనష్టాలను ఎదుర్కోలేదనే విషయాన్ని ప్రస్తావిస్తుండడం గమనార్హం. రాష్ట్రంలో జనసేన, బిజెపి ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో టిడిపి కార్యకర్తలు తీవ్రంగా నష్టపోనున్నట్లు తెలుస్తోంది. సిఎం చంద్రబాబు నామినేటెడ్ పోస్టుల భర్తీలో స్వతంత్ర్య ఏజెన్సీ, వేగుల ద్వారా పారదర్శకమైన సమాచారం సేకరించిన అనంతరం అర్హులైన టిడిపి కార్యకర్తలకు న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందనే వాదన వినిపిస్తోంది.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

గిర్నిమిట్ట ఆరోగ్య కేంద్రంలోని సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-కంభంవారిపల్లె (పీలేరు)

ప్రభుత్వ ఆస్పత్రులకు పలు రకాల రోగాలతో వచ్చే ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. మంగళవారం మండలం గర్నిమిట్టలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. మొదటగా కలెక్టర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తూ అక్కడ ఉన్న అటెండెన్స్ రిజిస్టర్ను, ఒపి, మందుల రిజిస్టర్లను తనిఖీ చేశారు. మందులు అన్ని అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలందరికీ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మిత తనిఖీ చేస్తూ అక్కడ ఉన్న అంగన్వాడీ ఉపాధ్యాయురాలిని పిల్లలందరూ సమయానికి వస్తున్నారా, ఏ సమయాలకు భోజనం పెడుతున్నారు వంటి ప్రశ్నలు అడిగారు. మూడు రోజులుగా పిల్లలకు గుడ్లు అందుబాటులో లేవని అంగన్వాడీ ఉపాధ్యాయురాలు తెలపగా కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లలకు ఎప్పటికప్పుడు పౌష్టికాహారం అందించాలని గుడ్లు అందుబాటులో ఉండాలని అంగన్వాడీ కేంద్రంలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఆదేశించారు. మహిళా పోలీసును ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి నెల కనీసం రెండుసార్లు అయినా అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేయాలని ఆదేశించారు. కొంతమంది పిల్లలు మధ్యాహ్నం భోజనం చేయకుండానే అంగన్వాడీ కేంద్రం నుంచి వెళ్ళిపోతున్నారని కలెక్టర్ గుర్తించారు. దీనిపై ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో పనిచేసే ఉద్యోగులు, పిల్లలందరూ తప్పనిసరిగా ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. గర్నిమిట్ట పశు వైద్యశాలను ఆకస్మిక తనిఖీ చేయగా అక్కడి స్థానికులు పశు వైద్యశాలకు సంబంధించి కొన్ని ఫిర్యాదులు కలెక్టర్‌కి అందించారు. ఫిర్యాదులపై తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వారికి తెలిపారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యాలయంలో చదువుకుంటున్న ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థినులతో మాట్లాడుతూ భోజనం బాగుందా లేదా, పాఠాలు బాగా చెబుతున్నారా లేదా, వంటి ప్రశ్నలు అడిగారు. సొంతంగా ప్రశ్నలు వేసుకొని విశ్లేషణాత్మకంగా చదువుకోవాలని విద్యార్థినులకు సూచించారు.

రైతాంగ సమస్యలపై పోరాటాలు

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

దేశంలో ఏ వర్గానికి లేని ఇబ్బందులు, సమస్యలు రైతాంగం ఎదుర్కొంటోందని, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి రైతులను సమీకరించి పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక ఓ కల్యాణ మండపంలో ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సమ్మేళనం రెండవ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల బిజెపి పాలనలో దేశంలో రైతు ఆత్మహత్యలు పెరిగాయన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద పోరాటం డిల్లీ రైతాంగ పోరాటమని అభివర్ణించారు. ప్రధాని మోడీకీ ఎటువంటి విజన్ లేదన్నారు. దేశ సంపద అంతా కార్పొరేట్ శక్తులకు కట్టపెట్టేందుకు మోడీ ప్రభుత్వం పాలన చేస్తోందని ఆరోపించారు. దేశ రాజకీయాలను కార్పొరేట్లు శాసిస్తున్నారని, వారి ప్రయోజనాల కోసం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పరిపాలన సాగించడం సిగ్గు చేటన్నారు. గత పదేళ్లలో దేశంలో ఎవరి సమస్యలు మోడీ పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ప్రతిపక్ష పార్టీల నేతలను వామ పక్షాలను, ప్రశ్నించే వామపక్ష మేధావులపై అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపుతూ బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నాడని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో 400 సీట్లు గెలుస్తామని ప్రగల్భాలు పలికినా ప్రజలు తగిన బుద్ది చెప్పి 60 సీట్లు తగ్గించారన్నారు. గడిచిన ఐదేళ్లు జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అరాచక పాలన సాగించి, పరిపాలన గాలికి వదిలేశారని విమర్శించారు. మంత్రులు, ఉప ముఖ్యమంత్రులు కలిసేందుకు కూడా అపాయింట్మెంట్ ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాజిక న్యాయం అంటూ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన జగన్‌కు ప్రజలే తగిన బుద్ధి చెప్పారన్నారు. రాష్ట్రానికి పూర్తిగా న్యాయం జరగాలంటే కేంద్ర బడ్జెట్‌లో రూ.15 వేల కోట్ల అప్పుగా కాకుండా గ్రాంట్‌గా ఇవ్వాలని, వెనుక బడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని, పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి ప్రజలకిచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ఈశ్వరయ్య, కెవివి ప్రసాద్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు కాటమయ్య, జమలయ్య, జగన్నాథం, రామానాయుడు, అప్పల నాయుడు, డేగా ప్రభాకర్, ఎపి ప్రజా నాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి పెంచలయ్య, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి పిఎల్ నరసింహులు, సహాయ కార్యదర్శి మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు తోపు కృష్ణప్ప, సాంబశివ, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ళ రంగారెడ్డి, సిపిఐ మదనపల్లి నియోజకవర్గ కార్యదర్శి మురళి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

సొంతింటి కల చంద్రబాబుతోనే సాధ్యం : 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పేద, మధ్యతరగతి ప్రజల పక్షపాతి ముఖ్యమంత్రి చంద్రబాబేనని, ఆయన ద్వారా పేద ప్రజల సొంతింటి కల నెరవేరుతుందని టిడిపి రాజంపేట పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోలేని వారికి కూడా ప్రభుత్వం సాయం చేయనుందని, పేద, మధ్యతరగతి వారి కోసం రూ.4 లక్షలు ఇంటి నిర్మాణానికి అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల హామీలలో భాగంగా ఒక్కొక్కటి నెరవేర్చుకుంటూ పోతున్న కూటమి ప్రభుత్వం ఇప్పుడు మరొక కీలక నిర్ణయానికి నాంది పలికిందని, హౌస్ ఫర్ ఆల్ అనే విధానంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. కూటమి అధికారం చేపట్టేసరికి ప్రభుత్వ ఖజానాలో ఒక పైసా కూడా లేదని, ఏ శాఖలో చూసినా అప్పులే కనపడుతున్నాయి తప్ప ఆదాయ వనరులు ఏమీ లేవని తెలిపారు. ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేర్చాలన్న ఉద్దేశంతో 2014లో ముఖ్యమంత్రి చంద్రబాబు పిఎంఎవై కింద కేంద్రం వాటా రూ.1.80 లక్షలతో పాటు రాష్ట్ర వాటాగా గ్రామీణ ప్రాంతాల వారికి రూ.50 వేలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.లక్ష ఆర్థిక సహాయం అందించారని, తద్వారా 12 లక్షల మందికి లబ్ధి చేకూరిందని వివరించారు. వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టాక పేదల కలలపై నీళ్లు పోసిందన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ కార్యనిర్వాక కార్యదర్శి కోవూరు సుబ్రహ్మణ్యం నాయుడు, పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు, సిద్ధవటం మాజీ జడ్‌పిటిసి చలమయ్య యాదవ్, రాజంపేట మండల పార్టీ ఉపాధ్యక్షులు ఆర్.సతీష్ కుమార్‌రాజు, శవనవారిపల్లె సర్పంచ్ కోటయ్య నాయుడు, బోయపాలెం వార్డు-5 అధ్యక్షులు తేజాల ఆనంద్, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ సూర్యనారాయణ రాజు, తెలుగు యువత పార్లమెంట్ అధికార ప్రతినిధి సింగన పరుశురాం నాయుడు, యువ నాయకులు పస్తివారిపల్లె రామ్మోహన్ పాల్గొన్నారు.

మానవ హక్కుల సంఘం స్టూడెంట్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా సాయికుమార్

ప్రజాశక్తి-రాయచోటి : జిల్లా మానవ హక్కుల సంఘం స్టూడెంట్ సెల్ జిల్లా అధ్యక్షులుగా శెట్టిపల్లి సాయి కుమార్ ఎన్నికయ్యారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో విద్యార్థుల సమస్యలు పట్ల అనునిత్యం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తానని తెలియజేశారు. ప్రయివేట్, కార్పొరేట్ స్కూలు చేస్తున్న దోపిడీలపై పోరాడుతానని తెలిపారు ముఖ్యంగా ప్రయివేట్ స్కూల్ యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలో నిర్వహిస్తే ప్రత్యక్ష ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. ఫీజుల వివరాలు నోటీసు బోర్డులో ప్రకటించాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు తీసుకోకుండా అధిక ఫీజులు వసూలు చేస్తే ఆయా పాఠశాలల దగ్గర పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహి స్తామన్నారు. విద్యార్థుల సమస్యలపై ముందుండి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

మదనపల్లి మంటలపై కొనసాగుతున్న విచారణ

- హార్స్‌లీహిల్స్‌లో డిఐజి ప్రవీణ్ మకాం
- ప్రముఖుల ఇళ్ల నుంచి సేకరించిన పత్రాల పరిశీలన
- వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు...సబ్‌కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

మదనపల్లి సబ్‌కలెక్టర్ కార్యాలయం మంటల ఘటనకు సంబంధించిన విచారణ కొనసాగుతోంది. మంగళవారం డిఆర్‌ఒ సత్య నారాయణరావు, పోలీస్ విచారణాధికారి రాజ్‌కమల్, పర్యవేక్షణ అధికారులు ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు, కలెక్టర్ శ్రీధర్, సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, పలువురు తహశీల్దార్లు, ఆర్‌ఐలు, సర్వేయర్లు, సబ్‌కలెక్టర్ సిసి మణి, విఆర్‌ఎలు, సీనియర్, జూనియర్ అసిస్టెం ట్లను విచారిస్తున్నారు. ఇదిలాఉండగా డిఐజి కోయ ప్రవీన్ జిల్లాలోనే ప్రముఖ పర్యాటక ప్రదేశమైన హార్స్‌లీహిల్స్‌లో మకాం వేసి పలువురి ఇళ్ల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న పత్రాల పరిశీలనలో నిమగ్నమయ్యారు. ఇందులో మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఇంటిని తనిఖీ చేసి ఉండకూడని పత్రాలు ఉన్నాయనే అంశంపై కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈయనతోపాటు రైస్‌మిల్ యజమాని మాధవరెడ్డి, బాబ్‌జాన్, తిరుపతి, హైదరాబాద్‌లోని పెద్దిరెడ్డి పిఎ, ఎంపీ మిథున్‌రెడ్డి పిఎ, బండపల్లి అక్కులప్ప, ముని తుకారం, తట్టి శ్రీనివాసులరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటచలపతి, శశికాంత్, తదితరుల ఇళ్ల నుంచి స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్లను పరిశీలిస్తున్నారు. మదనపల్లి మంటలకు సంబంధించిన విచారణ ఒకవైపు సాగుతుండగా, మరోవైపు సబ్‌కలెక్టర్ కార్యాలయానికి ఫిర్యాదుదారులు వెల్లువెత్తుతున్నారు. మదనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోని నలుమూలల నుంచి వెల్లువెత్తుతున్న ఫిర్యాదుదారుల నుంచి వినతిపత్రాలను స్వీకరించే నాధుడే కరువయ్యారు. భూకబ్జాల బారిన పడిన ఫిర్యాదు దారుల నుంచి వినతిపత్రాల స్వీకరణకు అధికారులు లేకపోవడంతో ఫిర్యాదుదారుల తీవ్రమైన నిరాశతో వెనుదిరుగుతుండడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఇదిలాఉండగా మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయం పోలీసుల పహారాలో కొనసాగుతుండడం ఫిర్యాదు దారులకు, పౌరులకు అడ్డంకులు కలిగిస్తోంది. సబ్ కలెక్టర్‌ను కలవడానికి అవకాశం లేకుండా పోయింది. కనీసం ఫోన్‌లో సంప్రదించడానికి సైతం అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం కింద వివిధ కేటగిరీలకు చెందిన పెన్షన్ లు లబ్ధిదారులందరికీ ఇంటి వద్దనే ఆగస్టు 1వ తేదీన 100 శాతం పింఛన్లు పంపిణీ చేస్తామని, లబ్ధిదారులందరూ అందుబాటులో ఉండాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం విజయవాడ సిఎస్ క్యాంప్ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఆగస్టు ఒకటో తేదీన పూర్తిచేయాలని ఆదేశించిందన్నారు. ఈ మేరకు 31వ తేదీ మధ్యాహ్నంలోగా సంబంధిత బ్యాంకుల నుండి పింఛను మొత్తాలను డ్రా చేసుకొని పంపిణీకి సిద్ధం చేసుకోవాలన్నారు. ఆగస్టు 1వ తేదీన ఉదయం 5-30 గంటలకంతా క్షేత్రస్థాయిలో ఉండి 6 గంటలకు పెన్షన్ మొత్తాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం వహించిన, పొరపాట్లు జరిగినా సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. పెన్షన్ల పంపిణీకి సంబంధించి బయోమెట్రిక్ డివైస్‌లో ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే జిల్లా కేంద్రానికి తెలియజేసి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. జిల్లాలో 2,22,313 మంది పింఛన్ లబ్ధిదారులకు రూ.94.34 కోట్ల నగదును పంపిణీ చేస్తామన్నారు. పెన్షన్లు పొందే లబ్ధిదారులందరూ అందుబాటులో ఉండి సహకరించాలన్నారు. పింఛన్ల పంపిణీపై సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు.

భూమిని కబ్జా చేశారు : బాధితురాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పూర్వీకుల నుంచి సంక్రమించిన 18 ఎకరాల భూమి కాస్త అక్రమణలు పోగా మూడు ఎకరాలు మిగిలింది. అది కూడా పోతుందేమో అన్న బాధతో నా పేరు మీద పట్టా చేయించుకున్నా. అయినా కబ్జా దారులు వదలకుండా ఆక్రమించుకొన్నారు. ప్రశ్నిస్తే దాడి చేసి కొట్టారు. అధికారులను ప్రాధేయపడినా కరుణించకపోగా భయభ్రాంతులకు గురి చేశారు. కోర్టుకెళ్లి ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్న తమకు న్యాయం జరగలేదు అంటూ పిటిఎం మండలం నాగన్న కోట చెందిన బాధితురాలు మల్లంపల్లి లక్ష్మీ వాపోయింది. మంగళవారం ఆమె అర్జీ చేత పట్టుకుని న్యాయం కోసం సబ్ కలెక్టర్ కార్యాలయానికి వచ్చింది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. 1675ఎ, 1618ఎ సర్వే నెంబర్‌లో ఉన్న సదరు భూమిని లక్ష్మీ తన పేర డీఫారం పట్టా చేయించుకుంది. ఆ భూమిపై కూడా కన్నేసిన ఎంపీ మిథున్‌రెడ్డి డ్రైవర్ మనికంఠ భూమిని కబ్జా చేశాడు. అందులో ఇల్లు నిర్మించుకొని తమను రానీయకుండా ప్రశ్నిస్తే దాడి చేసి కొట్టాడు. న్యాయం కోసం తహశీల్దార్ శ్రీనివాసులు, వీఆర్వో సతీష్‌లను ఆశ్రయిస్తే వారు కూడా గెంటేశారు. కోర్టుకు వెళ్తానంటే.. మాకే ఎదురు చెప్తావా అంటూ నీ మీద కేసు పెట్టి బొక్కలో వేయిస్తామంటూ భయభ్రాంతులకు గురి చేశారు. మా భూమి కోసం కోర్టుకెళ్ళాను. కోర్టు సైతం ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చింది. అయినా వారు మాత్రం అధికారాన్ని, అధికారులను అడ్డు పెట్టుకుని నన్ను భూమిలోకి అడుగు పెట్టనీయలేదు. వచ్చావంటే చంపుతామని బెదిరిస్తున్నారు. న్యాయం కోసం ఇక్కడివరకు వచ్చానంటూ బాధితురాలు లక్ష్మి బోరున విలపించింది.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మానవ అక్రమ రవాణా నిర్మూలనకు చర్యలు

- ఎమ్మెల్యే షాజహాన్ బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే నివాసం వద్ద మంగళవారం పోర్డ్ సంస్థ ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో మానవతా విలువలు మెరుగుపడినప్పుడే మానవ అక్రమ రవాణాకు శాశ్వత పరిష్కారం ఉంటుందన్నారు. ఐదు సంవత్సరాలలో 30 వేల మందికిపైగా అక్కచెల్లెమ్మలు అదృశ్యమయ్యారని, వారి ఆచూకీ ఇప్పటికీ తెలియలేదని పేర్కొన్నారు. అందరం సమిష్టిగా సమస్యను లేకుండా చేయాలన్నారు. అనంతరం స్థానిక నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌లో మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు మాట్లాడుతూ బాలల అక్రమ రవాణా అనేక రూపాలలో జరిగే అవకాశం ఉందని తెలిపారు. బాలలు బయట వ్యక్తులతో పరిచయం లేని వారిని నమ్మకూడదని పేర్కొన్నారు. అనంతరం పోర్డ్ సంస్థ డైరెక్టర్ జల్లా లలితమ్మ మాట్లాడుతూ ఒంటరిగా జాతర్లకు, ఫంక్షన్లకు వెళ్ళకూడదని, పరిచయం లేని వారు ఇచ్చే తినే తిను బండారాలు తీసుకోరాదని పేర్కొన్నారు. సెల్ ఫోన్, సోషియల్ మీడియా, ఆన్‌లైన్ సేఫ్టీ గురించి అవగాహన కల్పించారు. ఈ హాస్టల్ వార్డెన్ రాంప్రసాద్, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ప్రమీల, మండల కో-ఆర్డినేటర్ రాధా రాణి, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ నిర్మల, అల్తాఫ్, జయలక్ష్మి, నరసింహ, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు టిడిపి నాయకులు నాగూర్ వలి, షంషీర్, కమలామ్రి కృష్ణ, సంగం బ్రదర్స్, జెసిబి వేణు, జీవి నాయుడు, మాకినేని చంద్రశేఖర్, సిమెంట్ రమణ, ప్రభాకర్, బిజెపి జర్మన్ రాజు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రత్యేక తరగతుల పేరుతో వేధించడం తగదు : పిడిఎస్‌యు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాల యాజమాన్యం పదవ తరగతి విద్యార్థులను ప్రత్యేక తరగతులు అని వేదించడం తగదని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నేతి నాగేశ్వర అన్నారు. మంగళవారం వారు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమావేశమై మాట్లాడుతూ జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు చొరవ చూపి అట్టి పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణంలో పాఠశాలలు మొదలైనప్పటి నుండి పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు అనే పేరుతో ఉదయం 6 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు విద్యార్థులను తరగతి గదిలోనే బంధీ చేస్తున్నారని, దీనివల్ల విద్యార్థులు మానసిక సమస్యలు ఎదుర్కొని క్షీణించి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా విద్యార్థులను వేధించి బట్టీ చదువులతో తమ పాఠశాల ఇన్ని ర్యాంకులు సాధించిందని ప్రకటనలు ఇచ్చుకోవడానికేనా అని ప్రశ్నించారు. కనీసం ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు పాఠశాలలను తనిఖీలు చేసి అదనపు తరగతులను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకులు నాని, ప్రసాద్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న డిఇఒ శివప్రకాష్‌రెడ్డి

నాణ్యమైన భోజనం అందించాలి : డిఇఒ

ప్రజాశక్తి-వీరబల్లి

మధ్యాహ్నం భోజనం పథకంలో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని డిఇఒ శివప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రెడ్డివారిపల్లి పెద్దివీడు పాఠశాలలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల సమస్యలపైన సిబ్బందితో మాట్లాడారు. పాఠశాలలో వంటగది, మరుగుదొడ్లు, మూత్ర శాలలను, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మధ్యాహ్న భోజనాన్ని భోంచేశారు. అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సందర్శించి పలు రికార్డులను క్షుణంగా పరిశీలించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. డిఇఒ వెంట ఎంఇఒ కృష్ణయ్య, ఎస్ఒ సాయిదివ్య, ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పింఛన్లు నిష్పక్షపాతంగా పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-కలకడ

పింఛన్ల పంపిణీ నిష్పత్తిపాతంగా నిర్వహించాలని ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన కలకడ మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడుతూ 90 శాతం పింఛన్లను ఈనెల ఒకటవ తేదీన పంపిణీ చేయాలని తెలిపారు. పింఛన్ దారులకు 30వ తేదీ విషయం తెలిపి పింఛన్ పంపిణీలకు వారు అందుబాటులో ఉండేటట్లు గ్రామాలలో తెలపాలన్నారు. మొదటి తేదీన 99శాతం పింఛన్లు పంపిణీ కార్యక్రమం పూర్తి చేయాలని మిగిలిన పింఛన్లను రెండవ తేదీ పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **బి.కొత్తకోట:** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ లబ్ధిదారుల ఇంటి వద్దకే అందజేయనున్నట్లు బి.కొత్తకోట ఎంపిడిఒ నూర్జహాన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో సచివాలయ సిబ్బందిచే 1న ఉదయం 6గంటలకే ప్రతి ఇంటికి పెన్షన్ల పంపిణీ చేపట్టాలని సూచించారు. ఈ పెన్షన్ల పంపిణీలో మండల అధ్యక్షులు, జిల్లా ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు,మండల పరిషత్తు ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, కో-ఆప్షన్ మెంబర్,సర్పంచ్‌లు, వార్డు మెంటర్లు, మండల ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, విఆర్ఒలు, గ్రామ సచివాలయ సిబ్బంది, ఎఎన్ఎంలు పాల్గొంటారన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని రెడ్డిపల్లి చెరువు ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యంస్వామి కల్యాణ మహోత్సవం రెడ్డిపల్లిపేట గ్రామప్రజలు, పల్లిశెట్టి సుబ్రహ్మణ్యంశెట్టి, దగ్గుపాటి సుబ్రహ్మణ్యం నాయుడు, కావుటూరు మనీ నాయుడు, ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముక్కా సాయివికాస్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్ పాల్గొన్నారు. కల్యాణోత్సవానికి అనంతరం హాజరైన భక్తులకు భోజన వసతి కల్పించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జనసేన మండల నాయకుడు పసుపులేటి వెంకటరమణ, టిడిపి మండల ఉపాధ్యక్షులు కాకర్ల చంద్రశేఖర్‌నాయుడు, నేలపాటి రామచంద్రయ్య నాయుడు, శివాజీ, ప్రేమ్ కుమార్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-పుల్లంపేట

రైల్వే కోడూరు వివిధ మండలాల్లోని విభిన్న ప్రతిభావంతుల సమస్యలను పరిష్కరించాలని కోరతూ అధ్యక్షులు మల్లు సుబ్బనరసారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా సాయివికాస్ రెడ్డిలను కోరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీనిచ్చారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు సుబ్బనరసారెడ్డి మాట్లాడుతూ త్వరలోనే వివిధ మండలాల నాయకులతో చర్చించుకుని వారిని కలిసి వారి సమస్యల పరిష్కారం దిశగా ముందుకు తీసుకెళ్తామనితెలిపారు. ముఖ్యంగా వికలాంగుల ధ్రువీకరణ పత్రం జరుగుతున్న అవకతవకలు, వికలాంగుల 2016వ చట్టం అమలు, అదేవిధంగా సంక్షేమ పథకాలలో ఐదు శాతం రిజర్వేషన్ కల్పించడం, రుణాలు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీపై ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా సాయి వికాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ మండల అధ్యక్షుడు ధనుంజయ, పుల్లంపేట ఉపాధ్యక్షులు వాహిద్, కోశాధికారి నరసింహులు, పెనగలూరు అధ్యక్షుడు తిరుపాల్, రాజంపేట అధ్యక్షులు అబ్దుల్‌ఖాదర్, ఉపాధ్యక్షుడు ఖాదం బాషా, వెంకట ప్రసాద్, తిరుమల్ రెడ్డి, చిరంజీవి, బాలాజీ పాల్గొన్నారు.

క్రీడాకారులకు బహుమతులు

ప్రజాశక్తి-కలకడ : పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మండలంలోని గంగాపురం పంచాయతీ షేర్‌ఖాన్ వంకలో గత వారం రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌లో విజేత మనీ టీంసభ్యులకు రూ.3వేలు మొదటి బహుమతిగా, రన్నర్స్‌కు ద్వితీయ బహుమతి జీవన్ టీం సభ్యులకు రూ.15వేలు అందించినట్లు తెలిపారు. క్రికెట్ టీమ్‌లో విన్నర్స్, రన్నర్స్‌కు మెమెంటోలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ విఆర్ఒ మదనమోహన్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి చంద్రమోహన్, మాజీ సర్పంచ్ త్యాగరాజు, రమణ, భరత్ , దగ్గుబాటి వెంకటేశ్వరరావు, తారకేశ్వర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గుజరి మండీలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : మదనపల్లె పట్టణం, గొల్లపల్లి రింగ్‌రోడ్డు లోని ఓ గుజిరి మండీలో సోమవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.2 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగింది. అగ్నిమాపక అధికారి శివప్ప, టూ టౌన్ సిఐ యువరాజ్ తెలిపిన వివరాలు.. స్థానిక గొల్లపల్లిలో కాపురం ఉంటున్న సయ్యద్ హుస్సేన్ గుజరీ వ్యాపారం చేస్తున్నాడు. రాత్రి10 గంటల ప్రాంతంలో కరెంట్ షాక్ సర్క్యూట్ వలనో లేక ఎవరైనా సిగరెట్ తాగి పడేయం కారణంగానో మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో మండి లోని సామగ్రి కాలిపోయింది. సమాచారం అందుకున్న రెండవ పట్టణ సిఐ యువరాజు సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. వెంటనే అగ్ని మాపక అధికారి శివప్ప సిబ్బందితో వచ్చి మంటలను అదుపు చేశారు.పెను ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పూరి గుడిసె దగ్ధం..

ప్రజాశక్తి-వాల్మీకిపురం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ పూరి గుడిసె దహనమై బాధితుడికి రూ.70వేలు ఆస్తి నష్టం వాటిల్లిన సంఘటన మండలంలోని చింతపర్తి పంచాయతీ తాళ్లపల్లిలో మంగళవారం చోటు చేసుకొంది. బాధితుడు చంద్ర కథనం మేరకు.. మండలంలోని చింతపర్తి గ్రామ పంచాయతీ తాళ్లపల్లె దళితవాడకు చెందిన చంద్ర కూలి పనులు చేసుకుంటూ జీవనంతో కుటుంబాన్ని పోషించుకుంటూ ఓ పూరి గుడిసెలో నివాసం ఉంటున్నాడు. చంద్ర కూలి పనులకు వెళ్లిన సమయాన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో గుడిసె కాలిపోయింది. గమనించిన చుట్టుప్రక్కల వాళ్లు హుటాహుటిన మంటలు ఆర్పినా ప్రయోజనం లేకపోయింది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న బట్టలు, బియ్యం, టివి, సామగ్రి తదితరం కాలి బూడిదయ్యాయి. దింతో బాధితుడు చంద్రకు రూ. 70వేలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లింది. బాధితుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు చంద్ర కోరారు.

అగ్నికి ఆహుతైన వస్తు సామగ్రి

మహిళలు చైతన్యవంతంగా ఉండాలి

ప్రజాశక్తి-గాలివీడు

మహిళలు ఆడపిల్లలు అక్రమ రవాణాకు గురి కాకుండా ప్రతి ఒక్కరూ చైతన్యవంతులుగా ఎదగాలని సర్పంచ్ మిట్టపల్లి లక్ష్మీదేవి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ఆవరణంలో ప్రధానోపాధ్యాయుడు దుర్గేశ్వరరావు, స్కూల్ కమిటీ చైర్మన్ కుందా లక్ష్మీ ప్రసన్న, రీడ్స్ సంస్థ ద్వారా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నేడు ప్రపంచ మహిళ అక్రమ రవాణా దినోత్సవ సందర్భంగా బాలికల ఉన్నత పాఠశాలలో ఈకార్యక్రమాన్ని ఏర్పాటు చేయడానికి రీడ్స్ సంస్థను ఆమె అభినందించారు. ఎంఇఒ పిల్లి నాగరాజు మాట్లాడుతూ మహిళలు, బాలికలు చైతన్యవంతులుగా ఎదగాలని చాలా జాగ్రత్తగా మెలగాలని అన్నారు. హెచ్‌ఎం దుర్గేస్వర్‌రాజు మాట్లాడుతూ బాలికలు చదువుపై మక్కువ పెంచి ఉన్నతమైన స్థితికి చేరుకోవాలని తెలిపారు. చట్టాలపై, మానవ అక్రమ రవాణాపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎస్ఐ వెంకటప్రసాద్ మాట్లాడుతూ మహిళల అక్రమ రవాణా అంటే కేవలం మహిళలె కాకుండా పురుషులతో పాటు పిల్లలు కూడా అక్రమ రవాణా అవుతుంటారని పిల్లలు లక్ష్యంగా చేసుకొని డబ్బు కోసం, అవయవాల దొంగలించడం కోసం పిల్లలను అపహరించుకపోతారని పిల్లలపై జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిడిపిఒ పద్మావతి, ఫైరజ్, నిర్మలాదేవి, పద్మావతి, అరుణకుమారి, సోనియా, రీడ్స్ సంస్థ అధ్యక్షులు శ్రీనివాసులు, రీడ్స్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ స్వాతి మధుకర్, వెంకటయ్య, ఉపాధ్యాయులు రమణయ్య, గంగయ్య పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిడిపిఒ పద్మావతి

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం

ప్రజాశక్తి-రామాపురం

నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వ అధిక ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని 13 పంచాయతీలలో తాగునీటి సమస్య ఉన్న గ్రామాలలో గత మూడు రోజుల నుంచి బోర్లు, పైపులైన్లు వేయడం లాంటి పను లు చేపడు తున్నట్లు తెలిపారు. సరస్వతి వల్లే కస్పాలో కార్యదర్శి ముందుకు వచ్చి పైప్ లైన్ వేయడం అభినందనీయని అన్నారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులు ముందుకు రావడం హర్షణీమన్నారు. రాచపల్లి పంచాయతీ గంగనేరు, నల్లగుట్టపల్లి దళితవాడ, సుద్దమల పంచాయతీ, ఓబులిొడ్డిగారిపల్లి తాగునీటి బోర్లు వేసినట్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా తాగునీటికి సమస్య పరిష్కారానికి మంత్రిప్రాధాన్యతను ఇస్తున్నారని అన్నారు.

పనులు ప్రారంభిస్తున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

నూతన బోరు ఏర్పాటు

ప్రజాశక్తి-పుల్లంపేట : మండల పరిధిలోని అయ్యలరాజుపల్లి గ్రామంలో తాగు నీటి బోరు కాలిపో వడంతో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి తనయుడు సాయి వికాస్‌రెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌లు నూతన బోరును ఏర్పాటు చేశారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి తీరు పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సాయి వికాస్ మాట్లాడుతూ తాగునీరు, విద్యుత్, సమస్యలు ఏమైనా ఉంటే తక్షణమే పరిష్కరిం చేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. పరిసర ప్రాంతాల్లో పిచ్చి మొక్కలు లేకుండా చూసుకోవాలని గ్రామస్తులకు తెలిపారు. గ్రామం చుట్టూ పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యం కూడా మన ఆధీనంలో ఉంటుందని పేర్కొన్నారు. నియోజవర్గంలో ఏ ఒక్కరికీ ఏ కష్టం వచ్చినా ముక్కా కుటుంబం అండగా ఉంటుందని అన్నారు. కార్యక్ర మంలో సర్పంచ్ పెంచలయ్య, కోటేశ్వరనాయుడు, సుబ్బారెడ్డి, శివానందరెడ్డి, రాజారెడ్డి, శివారెడ్డి, సురేందర్‌రెడ్డి, నరసింహారెడ్డి, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, తేజ, నాని పాల్గొన్నారు.

నూతన బోరును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, సాయివికాస్‌రెడ్డి

విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు : ఎంఇఒ

కళాశాలలకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఇఒ నారాయణ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలోని కళాశాలల విద్యార్థులకు సంబంధించిన పుస్తకాలను పంపిణీ చేసినట్లు ఎంఇఒ -2 నారాయణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎపి మోడల్ స్కూల్, కెజిబివి పాఠశాలల్లోని 433మంది విద్యార్థులకు సంబంధించిన ప్రభుత్వం ద్వారా అందిస్తున్న 5,196 నోటు పుస్తకాలు, 2623 టెస్ట్ పుస్తకాలను ఆయా క్లస్టర్లకు సంబంధించిన సిఆర్ పిల ద్వారాఅందజేసినట్లు తెలిపారు. విద్యార్థులు పుస్తకాలను సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలని సూచించారు. మండలంలో ఉన్న మూడు కళాశాలలోనూ ప్రతి సంవత్సరం విద్యార్థులు పోటీపడి ఉత్తమ మార్కులు సాధిస్తూ మండలానికి మంచి పేరును తీసుకువస్తున్నారని, ఈ సంవత్సరం కూడా అదే లక్ష్యంతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఆర్పిలు సుధాకర, పద్మనాభం, మంజుల, స్వాతి, సౌజన్య, ఎంఐఎస్ కోఆర్డినేటర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి : డిపిఒ

ప్రజాశక్తి-కలికిరి

మండల అధికారులు పారిశుధ్యంపై దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి ఆదేశించారు. మంగళవారం మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో పర్యటించారు. సాధారణ పర్యవేక్షణలో భాగంగా గ్రామ పంచాయతీలోని పారిశుధ్య కార్యక్రమాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. పిఆర్‌వన్ యాప్, ఓడిఎఫ్ యాప్‌లను స్వయంగా తనిఖీ చేసి వాటిపై సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. విజువల్లీ క్లీన్ గ్రామపంచాయతీలో భాగంగా మునేళ్ళపల్లి గ్రామ పంచాయతీని తనిఖీ చేశారు. మర్రికుంటపల్లి, మునేళ్ళపల్లి ఎస్‌డబ్ల్యూపిసి షెడ్‌లను సందర్శించి పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో కలికిరి మేజర్ గ్రామపంచాయతీ ఇఒ వై.గురుమోహన్, మర్రికుంటపల్లి, మునేళ్ళపల్లి సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, సచివాలయ సిబ్బంది, గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డిపిఒ ధనలక్ష్మి

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి : ఎంపిడిఒ

ఇంటి నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ పోలప్ప

ప్రజాశక్తి-ములకలచెరువు

ప్రభుత్వం ఇళ్లులేని నిరుపేదలకు పంపిణీ చేసిన ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఎంపిడిఒ పోలప్ప తెలిపారు. సోమ వారం మండలంలోని వేపూరుకోట బురకాయలకోట గ్రామాలలో నిర్మాణాలు జరుగుతున్న ఇళ్లను ఎంపిడిఒ పోలప్ప పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన హౌసింగ్ అధికారులు, ఇండ్ల లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. గుణాది, గోడలు మోల్డింగ్ పూర్తి చేసిన ఇంతవరకు బిల్లులు పడడం లేదని, బిల్లులు మంజూరైతే పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసుకుంటామని ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులు ఎంపిడిఒకు తెలిపారు. ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న లబ్ధి దారులకు ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అధికారులకు తెలిపారు. ఎంపిడిఒ వెంట హౌసింగ్ ప్రత్యేక అధికారి ఆర్డబ్ల్యూఎస్, హౌసింగ్ ఎఇలు, ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

క్షయ లేని సమాజం కోసమే బిసిజి టీకా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

క్షయ వ్యాధి లేని సమాజం కొరకే పెద్దలకు బిసిజి టీకాలు ప్రభుత్వం ప్రవేశపెట్టిందని హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్‌రఫీ, టిబి పర్యవేక్షకులు ప్రభాకర్ పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వారి ఆదేశాల మేరకు మదనపల్లె మునిసిపాలిటీ పరిధిలోని ఈశ్వరమ్మ కాలనీ 104 సేవల పాయింట్, దొంతివీధి లోని మక్కా మసీదు, ఈశ్వరమ్మ కాలనీ లోని రహమతీయ మసీదు, శివాజీ నగర్ లో పోలేరమ్మ గుడి, ఎస్టేట్ లోని గోకుల దాస్ వద్ద బిసిజి టీకా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ సోమ, గురువారాల్లో పెద్దలకు టిబి జబ్బు రాకుండా బిసిజి టీకాలు ఆరోగ్య కేంద్రాల్లో వేస్తారని తెలిపారు.వయోజనులు , పొగతాగేవారు తప్పకుండా టీకా వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో బొమ్మన చెరువు వైద్యులు డాక్టర్ ఫారూఖ్, టిబి శాఖ సిబ్బంది సుశీల, వనజ కుమారి, తరుణ్, దిల్షాద్, సులోచన, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి బిటెక్ మొదటి సంవత్సరం తరగతులు

ప్రజాశక్తి-మదనపల్లి

అంగళ్ళు సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు బుధవారం నుంచి తరగతులను ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. విద్యార్థులు, తలిదండ్రులు ఉదయం 10 గంటలకు కళాశాలలో ఏర్పాటుచేసిన ఓరియెంటేషన్ కార్యక్రమం పాల్గొనాలని తెలిపారు.

ఆరోగ్యానికి పౌష్టికాహారం అవసరం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పౌష్టికాహారంతోని విద్యార్థులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని టిడిపి యువ నాయకులు బీదం గురునాథ్‌యాదవ్ పేర్కొన్నారు. మదనపల్లె రూరల్ మండలం, బెంగళూరు రోడ్డులోని చిప్పిలి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం శుభదిన్ భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు గురునాథ్ యాదవ్ పోషక విలువలతో కూడిన భోజనాన్ని విద్యార్థులకు వడ్డించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఇఒ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ శుభదిన్ భోజన కార్యక్రమాన్ని దిగ్విజయంగా కొనసాగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం గురునాథ్‌యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదు వుతున్న ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తద్వారా నియోజకవర్గానికి మంచి పేరు తెస్తూ, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు చెంద్రాయుడు, జె.సి.బి.మధు సూదన్ రెడ్డి, నక్కలదిన్నె శీనా నాయక్, నయాజ్, షరీఫ్, ఖాదర్ బాషా, కిరణ్, బావాజాన్, వెంకట్రమణ, బండి అమర, వరప్రసాద్, దాము పాల్గొన్నారు.

రైల్వే సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

ప్రజాశక్తి-నందలూరు

నందలూరు రైల్వే కేంద్రంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కన్సల్టేటివ్ కమిటీ మెంబర్స్ కోరారు. మంగళవారం రైల్వే స్టేషన్ మేనేజర్ కమలాకర్, రైల్వే కమర్షియల్ ఇన్స్‌స్పెక్టర్ అమర్నాథ్ ఆధ్వర్యంలో స్టేషన్ కన్సలేట్టేవ్ కమిటీ సమావేశం జరిగింది.ఈ సమావేశంలో నందలూరు రైల్వేకి సంబందించిన సమస్యలు, కల్పించాల్సిన సదుపాయాల గురించి చర్చ జరిగింది. ముఖ్యంగా నందలూరులో రైళ్ల నిలుపుదల, రైళ్లకు నీళ్ళు నింపడం ,రైల్వే ఫంక్షన్ హాల్లో సదుపాయాల ఆధునీకరణ, నిర్మాణంలో ఉన్న రైల్వే అండర్ పాస్‌ని త్వరితగతిన పూర్తి చేయడం, పయాణికులకు వెయిటింగ్ రూమ్ లాంటివి తప్పనిసరిగా కావాలని కమిటీ మెంబర్స్ డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో కమిటీ మెంబర్స్ డాక్టర్ అరిగె రాంప్రసాద్, సమ్మెట శివప్రసాద్, ముంగి సుబ్బారాయుడు, మురళి పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన అధికారులు, కమిటీ సభ్యులు

నూతన ఆస్పత్రి భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, సాయివికాస్‌రెడ్డి

మెరుగైన వైద్య సేవలు అందించండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చిట్వేలి

ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలో ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని లేకుంటే చర్యలు తప్పవని అన్నారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసి భవనాన్ని పరిశీలించారు వీలైనంత త్వరగా భవనాన్ని ప్రారంభించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కోరారు. కార్యక్రమంలో రైల్వే కోడూరు నియోజకవర్గ టిడిపి ఇన్ ఛార్జి ముక్కారూపానంద రెడ్డి తనయుడు సాయివికాస్‌రెడ్డి, రాజుకుంట సర్పంచ్ గుత్తి నర్సింహులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బహిరంగ వేలం

ప్రజాశక్తి -రామసముద్రం

మదనపల్లి డివిజనల్ పంచాయతీ అధికారి నాగరాజు ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని సచివాలయం-2లో బుధవారం ఉదయం 11 గంటలకు వారపు సంత, బస్టాండ్ గేటు, దినసరి మార్కెట్ బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి విద్యావతి తెలిపారు. వేలంపాట పాడదలచినవారు వారపు సంత, దినసరి మార్కెట్‌కు రూ.లక్ష, బస్టాండ్ గేటుకు రూ.75వేలు డిపాజిట్ చెల్లించాలని తెలిపారు. వేలం పాట పాడువారు పంచాయతీలో ఎలాంటి బాకీలు ఉండరాదని నిబంధనలు ఉన్నట్లు పేర్కొన్నారు. దినసరి మార్కెట్ పొందువారు, వారపుసంతరోజు, ఉత్సవాలు, తిరుణాల, మినహా మిగతా రోజులలో రుసుం, వసూలు చేసుకోనవచ్చునని తెలిపారు. వేలంపాటలో పాల్గొనదలచిన వారు గ్రామపంచాయతీ నియమనిబంధనలు తప్పకుండ పాటించాలని తెలిపారు. ఈ వేలంపాటలో మండల అభివృద్ధి అధికారి దిలీప్ కుమార్, సర్పంచ్ కవిత, విజయ్ కుమార్‌గౌడ్ పాల్గొనున్నట్లు తెలిపారు.

ఘనంగా ఆడి కృత్తిక వేడుకలు

ప్రజాశక్తి-కలకడ

మండలంలో ఆడి కృత్తిక వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. మండలంలోని దేవళంపేటలో వెలిసిన శ్రీకామాక్షి సమేత సిద్దేశ్వరస్వామి ఆలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో ఆడి కృత్తిక వేడుకలను నిర్వహించుకోవడం విశేషం. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించి తమ మొక్కలు తీర్చుకున్నట్లు తెలిపారు. గోపాలపురంలో వెలిసిన శ్రీ షిరిడిసాయిబాబా ఆలయంలో ఆడి కృత్తిక వేడుకలను నిర్వహించుకున్నట్లు తెలిపారు.

వైభవంగా పీర్ల పండుగ

ప్రజాశక్తి-ములకలచెరువు

మండలంలోని పాత ములకలచెరువు, దేవుల చెరువు ప్రాంతాల్లో మొహరం సందర్భంగా పీర్ల పండుగను గ్రామస్తులు పెద్ద ఎత్తున కన్నుల పండువగా జరుపుకున్నారు. పాత ములకలచెరువులో నిర్వహించిన పీర్ల పండుగ మంత్రి గిరిధర్ రెడ్డి, మంత్రి ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఏటా వచ్చే ఈపండగకు చాలా ప్రాముఖ్యత ఉదని అన్నారు. రాత్రి పూట ఏర్పాటు చేసిన గుండంలో మంటలు మండించి, డప్పుల వాయిద్యాల మధ్య గ్రామంలోని చిన్న పెద్ద తేడా లేకుండా గుండం చుట్టూ చిందులు వేశారు. పీర్లను చావిడిలో ఏర్పాటు చేసి పీర్లను రకరకాల పూలతో అలంకరించారు. యువకులు నియమ నిష్టలతో వాటిని మోస్తూ గ్రామంలో డప్పుల వాయిద్యాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. కులం మతం తేడా లేకుండా గ్రామంలోని వారంతా కలిసికట్టుగా నిర్వహించే ఈ మొహరం వేడుకలను వీక్షించేందుకు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన పిల్లలు పెద్దలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఆఖరిరోజు రాత్రి పీర్ల ఊరేగింపు అనంతరం ఉదయం వేకుజామున గుండంలో ఎర్రటి నిప్పులు ఏర్పాటుచేసి పేర్లను ఎత్తుకొని గుండంలో నిప్పులపై నడుచుకుంటూ వెళ్లారు. ప్రతిరోజు ఊరేగింపుగా తిప్పిన పేర్లను చావిడిలో ఏర్పాటు చేసి ఆఖరిరోజు సాయంకాలం జెల్ది నిర్వహిస్తారు. ప్రతి ఏడాది క్రమం తప్పకుండా గ్రామంలో అందరి సహకారాలతో మొహరం వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలో ప్రజలు అతిసార, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ముందు జాగ్రత్తలు పాటించాలని కన్నమడుగు పంచాయతీ కార్యదర్శి సుశీల కోరారు. మంగళవారం పారిశుధ్యం, పక్షోత్సవాల్లో భాగంగా పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టారు. తాగునీటి ట్యాంకులను శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లించారు. తాగునీటి కుళాయిల వద్ద మురికి నీటి గుంతలను తొలగించి బ్లీచింగ్ పౌడర్, అబైట్ ద్రావణాన్ని పిచకారి చేయించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు రాత్రివేళ దోమ కాటుకు గురి కాకుండా దోమతెరలు వాడాలని, వేపాకు పొగ వేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలని తెలిపారు. ఫ్రైడే డ్రైడేగా పాటించి పారిశుధ్యాన్ని మెరుగుపరచుకోవాలన్నారు. జ్వరాల బారిన పడిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యచికిత్సలు పొందాలని సూచించారు. అన్ని గ్రామ పంచాయతీలలో పంచాయతీ కార్య దర్శులు, వైద్య సిబ్బంది సంయుక్త ఆధ్వర్యంలో పారిశుధ్య మెరుగుకు చర్యలు చేపట్టారు.

ప్రతి సమస్యకూ పరిష్కారం చూపుతాం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు పట్టణంతో పాటు నియోజకవర్గ పరిధిలోని ఇంటింటికీ తిరుగుతూ, ప్రతి సమస్యకూ పరిష్కారం చూపుతానని పీలేరు ఎమ్మెల్యే కిషోర్ కుమార్‌రెడ్డి సతీమణి తనుజారెడ్డి తెలిపారు. మంగళవారం ఆమె పీలేరులో పర్యటించి టిడిపి, బిజెపి, జనసేన, మహిళలు, కార్యకర్తలు, నల్లారి అభిమానుల కుటుంబ సభ్యులను కలిశారు. ఎన్నికల్లో మీరందరూ చూపిన ఆదరాభిమానాలు, సహాయ, సహకారాలు, సేవలు మరువలేనివని అన్నారు. టిడిపి కార్యాలయానికి చేరుకున్న తనుజా రెడ్డికి టిడిపి, జనసేన మహిళలు, కార్యకర్తలు, ఆమెకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తనూజరెడ్డి మాట్లాడుతూ కిషోర్‌కుమార్‌రెడ్డి గెలుపుకోసం పనిచేసిన కార్యకర్తలు, అభిమానుల కృషి మరువలేనిదని అన్నారు. అనంతరం పీలేరు పట్టణంలోని మండల కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డిని పరామర్శించారు, పద్మావతి నగర్‌కు చెందిన మరో టిడిపి కార్యకర్త నాగేంద్రకు గుండపోటు రావడంతో ఆయన కోలుకుని ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకొంటునట్లు తెలిసి అక్కడకు చేరుకొని నాగేంద్ర ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి భరోసా కల్పించారు.

క్రైం కార్నర్

తట్టివారిపల్లెలో దొంగల బీభత్సం

-ఇంట్లోకి చొరబడి నగలు, నగదు అపహరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె గ్రామీణ మండలం తట్టువారిపల్లి సమీపంలోని శ్రీనగర్ కాలనీలో దొంగలు బీభత్సం సృష్టించి భారీ చోరీకి తెగబడ్డారు. ఇంట్లోకి చొరబడి నగలు, నగదును దోచుకెళ్లారు. ఈ సంఘటన మంగళవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..మండల పరిధిలోని తట్టివారిపల్లె సమీపంలోని శ్రీవారినగర్‌లో ఉపాధ్యాయుడు గురుమూర్తి నివాసముంటున్నారు. ఆదివారం కుటుంబ సభ్యులందరూ ఇంటికి తాళాలు వేసి కలికిరిలో జరుగుతున్న జాతరకు వెళ్లినట్లు తెలిపారు. ఇంటికి తాళాలు వేసి ఉండడాన్ని గమనించిన దొంగలు తాళాలు పగలగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలను తెరిచి అందులో ఉన్న విలువైన బంగారు, వెండి ఆభరణాలు, నగదు దోచుకెళ్లినట్లు బాధితులు వాపోతున్నారు. సుమారు రూ.10 లక్షలకు పైగా విలువైన వస్తువులు, నగదు అపహరణకు గురైనట్లు తాలుక పోలీసులు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.